

# తేలు కుట్టిన దొంగ

-ఎం.గాంధీ

"అక్కా... ఈ చీర నీకు చాలాబావుంది'' అంది అప్పుడే అక్కడికొచ్చిన పక్కింటి అనసూయ.

ఆ పొగడ్త విన్న శారద, ఆమెకి తనదో ఏదో అవసరం వచ్చిందన్న సంగతి పసిగట్టింది.

"అక్కా... మా ఫ్రెండ్ పెళ్లికి వెళుతున్నాను. ఆ మధ్య నువ్వు కొనుక్కున్న నెక్లెస్ ఓసారి ఇస్తావా? పెళ్లి నుండి రాగానే ఇచ్చేస్తాను'' అని అడిగింది.

శారద మారుమాట్లాడకుండా ఆ నెక్లెస్‌ని అనసూయ చేతుల్లో పెట్టింది.

పెళ్లికి అందంగా సింగారించుకుని వెళ్లిన అనసూయని ఎవరూ అంతగా పట్టించుకోలేదుగానీ, ఆమె మెడలోని నెక్లెస్‌ని మాత్రం పట్టి పట్టి చూశారు. 'ఈ నెక్లెస్ ఎక్కడ కొన్నారు? ఎంత ఖరీదు?' అంటూ అందరూ ఆ నెక్లెస్ గురించి అడిగేవాళ్లే! దాంతో అనసూయ చిన్న మెదడులోకి దుర్బుద్ధి ప్రవేశించి, తిన్నగా తిష్టవేసుక్కూర్చుంది.

పెళ్లి నుండి ఇంటికొస్తూనే అనసూయ, ఆ నెక్లెస్‌ని తన స్వంతం చేసుకోడానికి ఏ అబద్ధం చెప్పాలా అని వక్రమార్గంలో ఆలోచించడం ప్రారంభించింది.

చివరికో ఐడియా వచ్చింది ఆమెకి. నెక్లెస్ పోయిందని చెప్పి ఎంతో కొంత డబ్బు ఇచ్చేస్తే శారద ఇంకేమీ చెయ్యలేక ఊరుకుంటుందిలే అని తనను తాను సమాధానపరుచుకుంది. ఇంటికొచ్చిన వెంటనే తను ఆడే దొంగ నాటకం రక్తికట్టేలా శారద ముందు ఎలా నటించాలో అద్దం ముందు రిహార్సల్స్ చేసుకుంది. ఆస్కార్ అవార్డు ఎగురుకుంటూ వచ్చి ఒళ్లో వాలిపోయేంత లెవెల్లో శారద ముందు తన నటనాకౌసలాన్ని ప్రదర్శించింది అనసూయ.

"నన్ను క్షమించక్కా... ఇలా జరుగుతుందని నేను కలలో కూడా అనుకోలేదు. నెక్లెస్ పోయిందానికంటే నీదగ్గర మాట పోయినందుకే నేనెక్కువ బాధపడుతున్నాను. నేను దాచుకున్న ఈ పదివేలు తీసుకుని, 'నిన్ను క్షమించాను చెల్లీ' అని మనస్ఫూర్తిగా ఒక్కమాట అను అక్కా... అప్పుడే నాకు మనశ్శాంతిగా వుంటుంది'' అంటూ చివరి అంకంలో డైలాగులతో నాటకం రక్తి కట్టించింది.

"పర్వాలేదులే అనసూయా... నువ్వు కావాలని పారేయలేదు కదా! ఇలాంటి సంఘటనలు అనుకోకుండా జరుగుతుంటాయి. ఆ నెక్లెస్‌ని నేను ఇరవై వేలు పెట్టి కొన్నాను. అయినా పర్లేదులే, మిగతా డబ్బు నేను వేసుకుని అలాంటిదే ఇంకోటి కొనుక్కుంటాను చెల్లీ'' అంటూ అనసూయ ఇచ్చిన పదివేలు రూపాయలు తీసుకుంది శారద.

ఆమె చాలా ఈజీగా పదివేలకి ఒప్పేసుకున్నందుకు లోలోపల తెగ ఆనందపడిపోతూ ఇంటికి వెళ్లిపోయింది అనసూయ.

* * *

ఒక నెల రోజుల తర్వాత, బంగారం రేటు ఆకాశానికి అంటిపోయి చుక్కల్ని కూడా తాకేస్తోందని న్యూస్ పేపర్ల నిండా వార్తలు చూసీ చూసీ అనసూయకి ఓ ఆలోచన వచ్చింది.

శారదని మోసం చేసి తను తక్కువ డబ్బుకి కొట్టేసిన నెక్లెస్ విలువని అంచనా వేయించాలని దాన్ని సేఠ్ చమన్‌లాల్ దగ్గరికి తీసుకెళ్లింది.

సేఠ్ చమన్‌లాల్ ఆ నగని ఎగాదిగా చూసీ చూసీ రుద్దీ రుద్దీ, అప్పుడు తలెత్తి అనసూయ ముఖంలోకి జాలిగా చూశాడు. "ఇది వెయ్యి రూపాయలు కూడా ఖరీదు చెయ్యదు. ఎవరో నిన్ను మస్తుగా మోసం చేశారు బహెన్!'' అంటూ ఆ నెక్లెస్‌ని అనసూయ చేతిలో పెట్టేశాడు.

మెరిసేదంతా బంగారం అనుకుని మోసపోయి, శారదను మోసం చేయాలని చూసింది అనసూయ.

వెయ్యి రూపాయలు పెట్టి కొన్న నగకి మెరుపు తగ్గకుండా మరో వెయ్యి రూపాయలతో గోల్డ్ కోటింగ్ వేయించింది శారద. నెక్లెస్ పోయిందని చెప్పి అనసూయ తనకు నష్టపరిహారంగా పదివేలు ఇస్తాననేసరికి, దుర్బుద్ధితో అసలు నిజం దాచిపెట్టి ఆమెని మోసం చేసింది శారద.

ఇద్దరూ ఇద్దరే...

'నన్ను మోసం చేశావని' అనసూయ శారదని నిలదీసి అడగనూలేక, డబ్బు అడిగి తీసుకోనూలేక తేలు కుట్టిన దొంగలా వుండిపోయింది.

★